# నామాల సింగడు

సింగడు ఒక పెద్ద గజదొంగ. నామాలు అనేది అతనుండే గ్రామం పేరు. అందువలన అతనికి నామాలసింగడు అని పేరువచ్చినది. రాయలసీమతో కదిరి నుండి పులివెందలకు వెళ్లే మార్గములో ఒక కనుమ వద్ద నామాలగుండు ఉన్నది. ఆ గుండు దగ్గర నుండి రెండు కిలోమీటర్లు నడిచివెళితే సింగడి స్థావరం వస్తుంది. సింగడు రోజుకొక గ్రామం కొల్లగొట్టేవాడు. కొల్లగొట్టి వచ్చిన తర్వాత గుర్తుగా ప్రతిసారి కొండ ప్రక్కన ఉన్న గుండు మీద ఒక నామం పెట్టేవాడు. అందువలన ఆ గ్రామానికి నామాల గుండు అని పేరువచ్చింది. ఇతను, ఇతని అనుచరులు పెద్ద పెద్ద బండలను పైకెత్తటంలో నేర్పరులు. ఇతని వద్ద రెండు పిడిబాకులు ఉండేవి. అవి అతని దగ్గర ఉన్నంతవరకూ ఎవరూ అతనిని ఏమీ చేయలేరు. ప్రభుత్వం సింగడిని ఎట్లా అయినా పట్టుకోవాలని గుండు ఎత్తే పందాలును కనుమ క్రింద కొట్టాల గ్రామంలో ఏర్పాటు చేశారు. సింగని అనుచరులు ఆ పోటీలో పాల్గొంటారు. కానీ వారు ఆ గుండును మోకాళ్ల వరకే ఎత్తగలుగుతారు. అప్పటిదాకా ప్రేక్షకులలో ఉన్న సింగడు ముందుకొచ్చి తన అనుచరులను గుండు ఎత్తనందుకు తిడతాడు. ఆవేశములో తనవద్దవున్న రెండుపిడిబాకులను ఇతర ఆయుధములను తన అనుచరినికిచ్చి తానే గుండును పైకెత్తి చుట్టూ తిప్పుతాడు. గ్రామస్థులు అతనినే సింగడుగా గమనించి వెంటనే అతనిని పట్టుకొని రెండుచేతులను తాళ్లతో బంధించి అతనిని తిరుపతిలో ఉన్న ఠాణాకు తీసికొని వెడతారు. సింగడిని జనం పెడరెక్కలువంచి తీసికొనివెళ్లుతున్నప్పుడు సింగడు బంధవిముక్తి కోసం చేయు హావభావములే నామాల సింగడి జాపద రూపంలో ముఖ్యముగా ప్రదర్శించేది. సింగడి వేషధారుడుని మంచి బలిష్టుని చూసి ఎన్నుకొంటారు. అతని రెండు చేతులలో రెండు పిడిబాకులు ఉంటాయి.

సింగడి వేషధారి తలకు గుడ్డకట్టి అందులో కిరీటమువలె వేపకొమ్మలను అమరుస్తారు. నుదుట నామాలు ఉంటాయి. కాళ్లకు గజ్జెలు ఉంటాయి. అతని రెక్కలను పెద్దతాడుతో విరగకట్టి ఇద్దరు మనుష్యులు లాగి పుచ్చుకొంటారు. డప్పుల వాద్య సహకారం ఉంటుంది. డప్పులు జోరుగా మ్రోగుతుంటే సింగడు వెనక్కి లాగుతున్న తాళ్లని బలంగా నెట్టుకొంటూ ముందుకు లయబద్ధంగా నృత్యం చేస్తూ వస్తూ వుంటాడు. వాద్య సహకారంగా 4 డప్పు వాయిద్యాలుంటాయి. ఇది వీరావేశముతో చేయు జానపద కళారూపం. ఉగాది పండుగ రోజున, పీర్ల పండుగ రోజున రాయలసీమప్రాంతములో ఈ కళారూపాన్ని గ్రామాలలో ప్రదర్శిస్తారు. రాయలసీమ ప్రాంతంలో ఈ కళారూపానికి ఎంతో ప్రాముఖ్యము ఆదరణ ఉన్నది.